7న బీసీల ఆత్మగౌరవ సభ

కాచిగూడ: బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన ఎల్‌బీ స్టేడియంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటున్న బీసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని భారతీయ ఓబీసీ సమాఖ్య సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం బర్కత్‌పురాలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ... బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని, దేశాన్ని పరిపాలించడంలో ప్రధాని నరేంద్రమోదీ ఆదర్శంగా నిలిచారన్నారు. పార్టీ నేతలు శ్రీధర్, శ్రీనివాస్, రమేష్, ప్రసాద్, తిరుమల్, రాజేందర్, శ్యామ్‌రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నల్లకుంట: నల్లకుంట టీఆర్టీ కాలనీలోని కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం కుసుమ హరనాథ మాసోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం రాధాకృష్ణులు, కుసుమ హరనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులచే నిర్వహించిన భజన ఆకట్టుకుంది. మధ్యాహ్నం భక్తులకు అన్న దానం చేశారు.



భజనలో పాల్గొన్న భక్తులు

అంబర్‌పేటలో ఆట మొదలైంది!

రసవత్తరంగా మారిన ఎన్నికల పోరు

- ఎన్నికల బరిలో మూడు పార్టీల నుంచి హేమాహేమీలు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే అయితే బీజేపీ అభ్యర్థి మాజీ మంత్రి
- తానేమీ తక్కువ కాదంటూ సీరియస్‌గా తీసుకున్న కాంగ్రెస్ అభ్యర్థి



బీజేపీ అభ్యర్థి సి.కృష్ణయాదవ్



బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్



కాంగ్రెస్ అభ్యర్థి సి.రోహిణ్‌రెడ్డి

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గంలో ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది. నియోజకవర్గంలో ఎప్పుడూ లేని విధంగా పోరు రసవత్తరంగా మారనుంది. ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి బరిలో నిలవనున్న అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. మూడు పార్టీల అభ్యర్థులను బలమైన వనరులు ఉండటంతో ఈ దఫా అంబర్‌పేట ఎన్నికలపై అందరికీ ప్రత్యేక ఆసక్తి నెలకొంది. మిగతా నాలుగు, ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో ఏవైనా రెండు పార్టీల మధ్యే పోరు ఉండేది. తాజాగా మూడు పార్టీల మధ్య ఉండనుంది అని పలువురు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

సిట్టింగ్ ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ అభ్యర్థి...

బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కాలేరు వెంకటేష్‌కు సిట్టింగ్ ఎమ్మెల్యే కావడం ప్రధానంగా కలిసి వచ్చే అంశం. అధికార పార్టీ అభ్యర్థిగా, ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల ప్రత్యేక ఓటు బ్యాంకు ఉందని ధీమాగా ఉన్నారు. నియోజకవర్గంలో అన్ని డివిజన్‌లలో పార్టీ క్యాడర్ ఉండటం, వారితో పాటు ఇటీవల బీజేపీ కార్పొరేటర్‌తో పాటు పలువురు బీజేపీ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరడంతో అధికార పార్టీ గెలుపుపై ఆశలు పెట్టుకుంది. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తను చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రచారంలో దూసుకెళుతున్నారు. పదిహేను రోజుల క్రితం నుంచే ఎన్నికల ఎదుర్కొనే కసరత్తులో కొంతవరకు పూర్తి చేసుకున్నారు.

బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి కృష్ణయాదవ్...

అంబర్‌పేట నియోజకవర్గానికి శాసనసభ్యుడిగా కృష్ణయాదవ్ ప్రతినిధ్యం వహించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా పనిచేశారు. నియోజకవర్గాన్ని కనుసైగలతో శాసించారు. అంతేకాకుండా నగరంలోనే ఒక వెలుగు వెలిగారు. తన హయాంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల ఆనవాలు నేటికీ కనిపిస్తుండటం గమనార్హం. తన ఇమేజ్‌తోపాటు బీజేపీ అడ్డాగా భావించే అంబర్‌పేట పార్టీ నాయకులు, కార్యకర్తలు కృష్ణ యాదవ్‌కు కలిసి వచ్చే అంశం. ఎన్నికలను ఎదుర్కొనేందుకు తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు.

పక్కా లోకల్ అంటూ కాంగ్రెస్ అభ్యర్థి...

రాజకీయాలపై అవగాహన ఉండి కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రోహిణ్‌రెడ్డికి అనూహ్యంగా ఆ పార్టీ అధిష్టానం అంబర్‌పేట టికెట్ కేటాయించింది. గతానికి భిన్నంగా అంబర్‌పేట కాంగ్రెస్ శ్రేణులు అతనిపట్ల పూర్తి స్థాయిలో సానుకూలంగా స్పందిస్తున్నారు. మాజీ ఎంపీ వి.హనుమంతురావుతో పాటు సీనియర్ నాయకులు అంతా అభ్యర్థికి అండగా నిలవడటంపట్ల అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అంటేనే అసమ్మతులకు పేరు అలాంటి వాతావరణం ఇక్కడ కనిపించడం లేదు. అంతేకాకుండా ఈ నియోజకవర్గంపై టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. రాజీ లేకుండా ఎన్నికల్లో కొట్లాడే నైజం నాది అంటూ ఇప్పటికే పార్టీ శ్రేణులకు అభ్యర్థి సంకేతం ఇచ్చారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నాయకురాలు



నల్లకుంట: నల్లకుంటకు చెందిన బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు జి.లిఖితగౌడ్ తన అనుచరులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు గులాబీ కండువా కప్పిన కాలేరు పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్‌ఎస్‌ను వీడనున్న మురళీకృష్ణ



అంబర్‌పేట్: బీఆర్‌ఎస్ పార్టీకి ఆ పార్టీ సీనియర్ నాయకుడు కె.మురళీ కృష్ణ గుడ్‌బై చెప్పనున్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ఆదివారం ఆయన అంబర్‌పేటలో తెలిపారు. గత 32 సంత్సరాలుగా రాజకీయాల్లో కొనసాగుతున్నానని, బీఆర్‌ఎస్ పార్టీలో నాయకులకు కనీస గౌరవం లేదని ఆయన ఆరోపించారు. తొమ్మిది సంవత్సరాలుగా బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగినా కనీస గుర్తింపు లేదన్నారు. త్వరలో టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతానన్నారు. అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్ రెడ్డి గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు.

పరుగులు పెట్టిస్తున్న ప్రచారం



క్రీడాకారులతో మాట్లాడుతున్న ముఠా గోపాల్

ముషీరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రచారాన్ని పదునెక్కించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సభలు, సమావేశాలు, కార్నర్ మీటింగ్‌లు, పలువురు చేరికలతో ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. ఆదివారం ఉదయం ముషీరాబాద్ డివిజన్‌లోని జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కంప్లెక్స్‌లో షటిల్ క్రీడాకారులతో సమావేశమయ్యారు. మినీస్పోర్ట్స్ కంప్లెక్స్‌లో కనీస సౌకర్యాలను మెరుగుపరుస్తామని, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నేతలు పరమేశ్వర్, సి.హెచ్.వీరారెడ్డి, రమణ, జైపాల్‌రెడ్డి, వామన్, చందు, సందీప్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ అడిక్‌మెంట్ డివిజన్ అచ్చుత్‌రెడ్డి మార్గ్‌లోని వీఎస్‌ఆర్ అపార్ట్‌మెంట్ వాసులతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అపార్ట్‌మెంట్ వాసులంతా తన విజయానికి కృషి చేయాలని కోరారు.

కాంగ్రెస్‌లో ప్రకంపనలు



విలేకరుల సమావేశంలో రాజీనామాను ప్రకటిస్తున్న నాగేష్‌ముదిరాజ్

ముషీరాబాద్: టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు నాగేష్ ముదిరాజ్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్ర పార్టీలన్నింటినీ కాంగ్రెస్‌లో కలుపుకొని తెలంగాణ మీద దండయాత్ర చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీలో బీసీలకు తగిన గుర్తింపు ఇవ్వకుండా అణగదొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ ముదిరాజ్‌లను అన్ని విధాలా ఆదుకుంటానని ప్రభుత్వం, పార్టీలో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పిస్తానని ఇచ్చిన హామీ పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. 1989లో బూత్ ఏజెంట్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి గత 34 సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎదిగానని తెలిపారు. 2, 3 రోజుల్లో తన నిర్ణయం ప్రకటిస్తానని తెలిపారు.

బీఆర్‌ఎస్ వైపు చూపు...

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన నాగేష్ ముదిరాజ్ బీఆర్‌ఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో సమావేశమైన ఆయన పార్టీలో చేరేందుకు సుముకత వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో ముదిరాజ్‌లకు ఒక్క టికెట్ కూడా కేటాయించకపోవడంతో ఆ కమ్యూనిటీ నుంచి వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో వివిధ పార్టీలలోని ముదిరాజ్‌లను చేర్చుకునేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అందులో భాగంగానే ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నాగేష్‌ను పార్టీలో చేర్చుకునేందుకు బీఆర్‌ఎస్ అగ్ర నాయకులు ప్రయత్నించి ముఠా గోపాల్ ద్వారా మంతనాలు సాగించినట్లు తెలిసింది.

కాంగ్రెస్‌కు ఎలాంటి నష్టం లేదు: మాజీ కార్పొరేటర్

నాగేష్ ముదిరాజ్ కాంగ్రెస్‌ను వీడడం వల్ల ఆ పార్టీకి జరిగే నష్టం ఏమి లేదని కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు వాజీద్‌హుస్సేన్, ఆర్.కల్పనయాదవ్ స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... బూత్‌స్థాయిలో ఉన్న ఓ నాయకుడిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని స్పష్టం చేశారు. నాగేష్‌ముదిరాజ్ ఈ స్థాయిలో ఉన్నాడంటే దానికి మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ కారణమేనని తెలిపారు. రెండుసార్లు రైల్వే బోర్డు మెంబర్‌గా నగేష్ ముదిరాజ్‌ను అంజన్‌కుమార్‌యాదవే నియమించారని గుర్తు చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఈ విధంగా బ్లాక్‌మెయిల్ చేయడం నగేష్‌ముదిరాజ్‌కు అలవాటేనని గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీఎల్‌ఎఫ్ తరఫున పోటీ చేయడానికి సిద్ధపడ్డాడని గుర్తు చేశారు. ఈ దఫా కూడా అలాంటి బ్లాక్ మెయిల్స్‌కు పాల్పడితే అంజన్‌కుమార్‌యాదవ్ ఖాతరు చేయకపోవడంతోనే ఆయన పార్టీ మారడానికి సిద్ధపడ్డారని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఈ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా కాంగ్రెస్ పార్టీ గెలిసి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో మేడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్లు వాజీద్ హుస్సేన్, కల్పనయాదవ్, మేడి సురేష్

పోటీలోనే ఉంటా..

10వ తేదీన నామినేషన్: సంగిశెట్టి జగదీష్



సంగిశెట్టి జగదీష్

ముషీరాబాద్: ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డ టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్ కాంగ్రెస్ పార్టీ రెబల్‌గా పోటీ చేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలిపారు. వారం పది రోజులుగా సొంతంగా సర్వే నిర్వహించుకున్న సంగిశెట్టి జగదీష్ 10వ తేదీన నామినేషన్ దాఖలు చేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గానికి స్థానికుడైన జగదీష్ తనకే టికెట్ కేటాయించాలని అధిష్టానానికి పలుమార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోకపోవడంతో స్థానికేతరుడైన అంజన్‌కు టికెట్ కేటాయించడం పట్ల ఆయన ఆగ్రహంగా ఉన్నారు. అప్పటి నుంచి ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. నియోజకవర్గంలో తన కమ్యూనిటీ పద్మశాలీ సామాజికవర్గం 40–50 వేల ఓటర్లు ఉన్నారని దానికి తోడు తన కుటుంబం నాయిని నర్సింహారెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని బీడీ కార్మికులు, ఇతర దళిత సామాజిక వర్గంలో కూడా చిన్నప్పటి నుంచి తమకు మంచి సంబంధాలు ఉన్నందున అందరి సూచనలు, విజ్ఞప్తుల మేరకు పోటీ చేయడానికి సిద్ధపడుతున్నట్లు తెలిపారు.

కేసీఆర్‌తోనే సుపరిపాలన సాధ్యం



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్

నల్లకుంట: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే సుపరిపాలన సాధ్యమని బీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. తాను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి తనకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆదివారం నల్లకుంట డివిజన్‌లో ఎమ్మెల్యే వెంకటేష్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా స్థానిక పాత రామాలయంలో పూజలు నిర్వహించిన కాలేరు అనంతరం లంకబస్తీ, డాక్టర్ చారీ లేన్, పాత రామాలయం లేన్, ఫీవర్ ఆస్పత్రి లేన్ తదితర ప్రాంతాలలో పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఆయనకు హారతులు ఇచ్చారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలోని పదకొండు పథకాలతో పాటు నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి రాగానే ప్రస్తుతం అందిస్తున్న ఆసరా పింఛన్ రూ. 2016ను దశలవారీగా రూ. 5 వేలకు పెంచడంతో పాటు మహిళల కోసం సౌభాగ్య లక్ష్మి పేరుతో కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా ఆడపడుచుల బ్యాంక్ ఖాతాల్లో నెలకు రూ. 3 వేలు జమ అవుతుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మేడి ప్రసాద్, ఎ.రమణానాయుడు, వ్నాడి రమ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బీఆర్‌ఎస్ అవినీతి పాలన అంతం

అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిణ్‌రెడ్డి



నర్సింహ బస్తీలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిణ్‌రెడ్డి

నల్లకుంట: తెలంగాణలో బీఆర్‌ఎస్ అవినీతి పాలనను అంతమొందించాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి ఓటర్లను కోరారు. ఆదివారం నల్లకుంట డివిజన్ నర్సింహ బస్తీలో డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిణ్‌రెడ్డికి స్థానికులు నీరాజనాలు పలికారు. ఇంటింటికీ వెళ్లిన ఆయన కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలోని ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతి నెల రూ. 2,500, రైతు భరోసాలో కౌలు రైతులకు రూ. 15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల, వరి పంటకు రూ. 500 బోనస్, గృహలక్ష్మి ద్వారా ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లులేని వారికి ఇంటి స్థలంతో పాటు, రూ. 5 లక్షలు, యువ వికాసం, వృద్ధులకు రూ. 4 వేల వృద్ధాప్య పింఛన్లు అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఎ. లక్‌పతి యాదగిరి గౌడ్, గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కె. గోవర్ధన్ రెడ్డి, లక్ష్మణ్ యాదవ్, సి. ధనార్ధన్ రెడ్డి, పొన్నాడ సుబ్రహ్మణ్యం, గ్రేటర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత రోహిత్, నాయకురాలు ఎ.జ్యోతి గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం దళితులు ఉద్యమించాలి



దసరా మిలాప్‌లో అభివాదం చేస్తున్న శ్రీనివాస్‌రావు తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దళితులంతా రాజ్యాధికారాన్ని సాధించే దిశగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.ఎస్.శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో దసరా మిలాప్–2023ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ... స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచిన దళితులు, బడుగు, బలహీన వర్గాలు రాజ్యాంగానికి దూరంగానే ఉన్నారన్నారు. దళితులంతా ఐక్యంగా తమ హక్కుల సాధన కోసం పోరాటం చేయాలన్నారు. ఐక్యవేదిక నాయకులు గజ్జల సూర్యనారాయణ, గడ్డం నవీన్‌కుమార్, రూపుల వివేక్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు గెల్వయ్య, కార్పొరేటర్ రచనశ్రీ, సుదర్శన్, పరిమళకుమార్, సిరిగిరి శ్యామ్, భీమనపల్లి రమేష్, పెద్దాపురం స్వామి, తిరుమల్, భాస్కర్, షరీఫ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి అండగా ఉంటా

ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్

కవాడిగూడ: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు విరక్తి చెంది రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్, ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం. అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలు ఒక్కటేనని ప్రజలను మోసం చేసేందుకే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మోసపూరిత వాగ్దానాలతో ప్రజల ముందుకు వస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కవాడిగూడ డివిజన్ పరిధిలోని భీమా మైదాన్, గుడాలబస్తీ, ఓంనగర్, అంబేద్కర్‌నగర్, సుభాష్‌చంద్రబోస్ నగర్, ఎస్‌బీహెచ్ కాలనీ, మారుతీ నగర్, మోతీలాల్ నెహ్రూనగర్, రోటరీ కాలనీ, ఎంసీహెచ్ క్వార్టర్స్ తదితర బస్తీలలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికీ తిరుగుతూ వివరించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. మారుతీనగర్‌లో వినూతనంగా టీ కొట్టువద్ద ఆగి అందరికి టీ అందించి వినూతన పద్ధతిలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వి.డి కృష్ణ, కవాడిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్, నగర నాయకులు పి.లక్ష్మణ్, సూర్యచంద్రశేఖర్, ఎం. ప్రభాకర్, నరేందర్, రాము, సంజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి, పేదల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ ముషీరాబాద్ నియోజవర్గం అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం రాత్రి గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ నగర ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్, గుర్రం చంద్రకళల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు మారిశెట్టి నర్సింగ్‌రావు, సాయికీర్తి బాబ్జీ, బానుచందర్ దోనేటి (న్యాయవాది) షేక్‌సలీం, పులి శ్రీనివాస్‌లకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల రూపాయలు దోచుకొని రాష్ట్రాన్ని అప్పుల పాటు చేశారని ఆరోపించారు. యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, నేతలు అభిషేక్ కెన్నడి, కెనడి రాజు, వీడీ కృష్ణ, సంగపాక వెంకట్, శీలంసత్యనారాయణ, మేడిసురేష్, సురేష్‌యాదవ్, భూకల కృష్ణయాదవ్, మైకేల్ ప్రసన్న, ప్రవీణ్, టీజేఎస్ నేతలు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, గుండెల్లి రవీందర్‌యాదవ్, జయ, కవిత తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్, బీజేపీ నేతలతో అంజన్‌కుమార్‌యాదవ్

అవినీతి రహిత సమాజమే లక్ష్యం

ఖైరతాబాద్: అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా ముందుకు సాగాలని కోరుతూ ఆదివారం యునైటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజాలో అవగాహన వాక్ నిర్వహించారు. విజిలెన్స్ అవగాహన వీక్‌లో భాగంగా చివరి రోజు యునైటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగులతో కలిసి అవగాహన వాక్ నిర్వహించారు. వాక్‌ను డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.వి.ఆర్.కృష్ణ ప్రారంభించారు. వాక్‌లో తిరుపాల్, విజిలెన్స్ ఆఫీసర్ కె.రమేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన మహాకుంభాభిషేక మహోత్సవం

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామి ద్వితీయ పుష్కర మహాకుంభాభిషేక వేడుకలు ఆదివారం కన్నుల పండువగా ముగిశాయి. ఈ వేడుకలకు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి అష్టోత్తర కలశాభిషేక సహిత మహాకుంభాభిషేకం, మహాపూర్ణాహుతి, మహాపడిపూజలో పాల్గొని అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించారు. శబరిమల ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ కంఠరారు మహేష్ మోహన్ తంత్రి ఆధ్వర్యంలో బలిపీఠాలు, ధ్వజస్తంభం, చండీశ్వరుడు, ఆలయ శిఖర యంత్రప్రతిష్టతో పాటు మహాపడిపూజ, శ్రీ అయ్యప్ప స్వామి పల్లకీ సేవ అంగరంగ వైభవంగా జరిగాయి. అయ్యప్ప భక్తులు వందలాదిగా తరలి వచ్చి అయ్యప్ప శరణుఘోషలో తరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సి.హెచ్. రామయ్య, ఈవో ఎన్. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



రాంనగర్‌లో వెంకటరమణను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: రాంనగర్‌కు చెందిన మామ్స్ హోటల్ నిర్వాహకులు వెంకటరమణ, జి.సాయి అవినాష్‌లు తమ అనుచరులతో కలిసి ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేసీఆర్ ప్రభుత్వం అవలంభిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఎంతో మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ముఠా గోపాల్‌ను మరోసారి విజయం సాధించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత సయ్యద్ అస్లాం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, నాగులు యాదవ్, పున్నం ప్రవీణ్, మహ్మదుల్లా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి బాపూనగర్‌లో...

చిక్కడపల్లి: చిక్కడపల్లి బాపూనగర్‌లో బీఆర్‌ఎస్ యువజన విభాగం డివిజన్ ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి విజయకుమార్ ఆధ్వర్యంలో స్థానిక యువకులు ఎమ్మెల్యే ముఠాగోపాల్ సమక్షంలో చేరారు. మాజీ కార్పొరేటర్ ముఠా పద్మనరేష్, నేతలు సాయి, రాకేష్‌కుమార్, శ్రీకాంత్, ముఠా శివసింహ తదితరులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేష్ ఆధ్వర్యంలో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్‌డీ) వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజ్ మాదిగ, దండోరా ప్రతినిధులు ముఠాగోపాల్‌కు మద్దతును ప్రకటించారు. గాంధీనగర్ డివిజన్‌లోని గంగపుత్రులు (బెస్త) బీఆర్‌ఎస్ నియోజవర్గం అభ్యర్థి ముఠా గోపాల్‌కు మద్దతు ప్రకటించారు. గంగపుత్ర సంఘం నాయకులు డీటీ రాంచందర్, సాన మల్లేష్, నీలి అంజయ్య, దయానంద్‌ల ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్‌లోని బాపునగర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ గంగపుత్రుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు.